# ధర్మసాధని

[బ్రాహ్మసాధనాశ్రమ పక్షమున ప్రతిశనివారము ప్రకటింపబడును.]

ధర్మంచర । ధర్మాత్ పరం నాస్తి । ధర్మః సర్వేషాం భూతానాం మధు.

సంపుటము ౮.

సంచిక ౨౨.

కాకినాడ:—శనివారము, ౨, జూలై, ౧౯౨౧.

చందా సం॥ రు ౩.

విడిసంచిక అ ౧.

## ఓమ్.

సర్వజ్ఞా! పరాత్పరా! మావిషయమున నీ వెరుంగనిది యేమి కలదు? మాకష్ట సుఖముల నీ వెరుంగుదువు. మాదుఃఖ సంతోషముల నీ వెరుంగుదువు. మాఆశా నిరాశల నీవెరుంగుదువు. మా ఉత్సాహ నిరుత్సాహముల నీవెరుంగుదువు. మా ధైర్యాధైర్యముల నీవెరుంగుదువు. మా ప్రలోభన పరితాపముల నీ వెరుంగుదువు. మా సచ్చింతల, దుశ్చింతల నీవెరుంగుదువు. మా పాప పుణ్యముల నీ వెరుంగుదువు. మా బలాబలముల నీ వెరుంగుదువు. మాతలంపు తలంపుల నీ వెరుంగుదువు. మా వచించు వాక్యముల నీ వెరుంగుదువు. మా చేయుచేతల నీ వెరుంగుదువు. మా బాహ్యాంతరముల నిండియున్న నీకు తెలియని దేమి యుండగలదు? చిత్రగుప్తుడవై సమస్తమును వీక్షించుచున్నావు. మమ్ము బాగుగా నెరిగియున్న నీవే మమ్ము బాగుచేయవలెను. సర్వసాక్షివగు నీయెదుట సాష్టాంగ పడుచున్నాము. పరమేశ్వరా! మమ్ము నీకు తోచిన విధమున దిద్ది యుద్ధరింపుము. మేము నీ వారము, నీ దాసులము, నీ పాదభక్తులము.

---

భజింపు డతని సదా!

సాధకా? కరుణా సముద్రుడగు భగవంతుని సర్వదా భజింపుము: నీ యోగ్యతా యోగ్యతలను గూర్చి యించుకేనియు చింతింపకుము. నీహృదయము పుణ్యభావ పరిపూర్ణమై యున్నను భజింపుము. లేక పాపానల సంతప్తమై యున్నను భజింపుము. భోగ భాగ్యములతో నీవు తలదూగుచున్నను భజింపుము. కటిక దారిద్ర్యముచే నిపీడితుడవై యున్నను భజింపుము. సంతోషముచే నుప్పొంగుచున్నను భజింపుము. దుఃఖముచే కుంగిపోవుచున్నను భజింపుము. ఏ యవస్థయందును నీవు భజన మాన జనదు. మంచి దశయందు భగవంతుని మరవకుము. దుర్దశయందును భగవంతుని విడువకుము. భజింపుము. ఆనందాశ్రువులతో నొకప్పుడు భజింపుము. దుఃఖాశ్రువులతో మరియొకప్పుడు భజింపుము. ఏవిధమున జూచినను పరమేశ్వరుడు నీకు భజనీయుడే. అతని భజనయే ఈ సంసారయాత్రయందు నీకు తోడగునది. విరామము లేక పరమేశ్వరుని భజనచేసి ధన్యుడవు కమ్ము. పా. స.

---

౧ సకలావస్థల యందును భగవంతుని యందు భక్తిగలిగి యుండవలయును.

౨. తలిదండ్రుల మీదవలె భగవానునిపై నిర్భరపడి యుండవలయును.

౩. భక్తిమార్గముననే యీశ్వరుడు లభ్యమగును. బాహ్యానుష్ఠానముల ద్వారా ఈశ్వరుడు లభ్యముగాడు.

౪. సచ్చరిత్రుడై, సర్వభూత దయగలిగి, భగవంతుని హృదయపీఠమునం దధిష్ఠింప జేసికొనవలయును. (తుకారాము.)

VEERESALINGAM THEISTIC ...
NO..........

# హిందూ విగ్రహ నిర్మాణ చరిత్రము.

———:o:o:o:———

(శ్రీ వ్రజేంద్ర చంద్ర భట్టాచార్యులు.)

ఋగ్వేదమున ముప్పది ముగ్గురు దేవతల పేరులను జూడగలము. దాదాపు ఆసమస్త దేవతలును గొన్ని ప్రాకృతిక దృశ్యముల నుండి కల్పింపబడిన మూర్తులు మాత్రమే. యీసకల దేవతల పూజయు బహిరంగప్రదేశముననే జరిగెడిది. పూజింపబడెడు దేవత ప్రాకృతిక దృశ్యముగా ప్రత్యక్షమగునప్పుడు దానియొక్క మూర్తి కల్పనచేయ నావశ్యకత లేకుండెను. ఈకారణముననే ఋగ్వేదమునందే దేవతనును మనుష్యునికి వలె మూర్తి కల్పన చేయబడలేదు. కాని యందనేక స్థలముల దేవతల యాకారము లభివర్ణింపబడియుండెను. ఆ దేవతలకు తల, ముఖము, కన్నులు, ఉదరము, హస్త పాదములు మొదలగు నవయవము లున్నట్లు చెప్పబడియుండెను. ఈ సకలాంగ ప్రత్యంగకములు పలుచోటుల రూపకార్థమున వ్యవహరింపబడినవి. ఎట్లన 'అగ్నియొక్క జిహ్వ' అనగా అగ్నిశిఖలు లేక జ్వాలలు. 'సూర్య బాహువు' అనగా సూర్యునిరశ్మి. ఋగ్వేదమున దేవతల కొక తలయు రెండు చేతులు నున్నట్లు చెప్పబడినది. ఆ బాహువులందా యా దేవతల కాయాయస్త్రములు గలవట. ఎట్లన నింద్రుడు వజ్రమును ధరించెను. ఏ దేవతలు స్పష్టముగ నుల్లేఖింపబడిరో యా ఋగ్వేద దేవతాగణము వారి వారి యాయుధముల మూలమునను వారి వారి వాహనముల మూలమునను తెలిసికొనబడుచుండిరి.

యాస్కాచార్యుల వారి కాలము (క్రీ. పూ. ౫౦౦) పర్యస్తమే దేవతావిగ్రహములును లేవు. అనంతరము పతంజలి (క్రీ. పూ. ౨౦౦) పాణినుల కాలమున దేవతా విగ్రహముల ప్రచలనము కలిగెను. సాంచీస్తూపమున ననేక స్థలముల నాటిరూపమున లక్ష్మీమూర్తి చెక్కబడియున్నది. అది పద్మముపై నొకచో గూర్చుండినట్లును మరియొకచో నిలుచుండినట్లును చెక్కబడినది. ఆమె రెండు చేతులలో రెండు పుష్పములు గలవు రెండేనుగులు ఆమె మస్తకమును నారిచే నభిషేకించుచుండెను. మరియొకచో రెండవ క్యాడ్ ఫాయిసిసుని రాజ్యకాల (క్రీ. ౧ శతాబ్దము) మందలి యొక ముద్రపై స్వాభావిక ద్విభుజ నరాకారమున శివమూర్తి చిత్రితమైయుండెను. ఈమూర్తియందు శివ సహచరియగు వృషభము త్రిశూలము చర్మమును జూడగలము.

మహాభారతమందలి యొక ప్రాచీన (క్రీస్తు జన్మమునకు పూర్వము లిఖింపబడిన) కథ గలదు. అందు దమయంతి నరాకృతులగు దేవతాగణముతో నున్న నలుని గుర్తింపలేక వారందరను దేవతలగా దలంచెను. కాని వెంటనే దేవతల కనిమేషత్వము మొదలగు వారి విశేష లక్షణముల నెరిగియుంటచే నా లక్షణముల మూలమున వారిని గుర్తించెనట.

పైన జెప్పబడినట్లు ప్రథమ శతాబ్ద పర్యన్తము దేవతాగణమునకు స్వాభావిక మనుష్యాకారమే కల్పింపబడియుండెను. కాని తదనంతర కాలమందలి సాహిత్య గ్రంథముల ననగా మహాభారత శేషభాగము రామాయణము మొదలగు పురాణ గ్రంథముల దేవతాగణమునకు చతుర్భుజము లున్నట్లు వర్ణింపబడియుండెను. బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు మొదలగు వారందరు నాలుగు చేతులవారే. ఒక్క బ్రహ్మ మాత్రము చతుర్ముఖుడు. మిగిలినవారందరొంటి మోమువారే. వారి వేర్వేరు చేతులయందు వేరు వేరాయుధములు గలవు.

రెండవ క్యాడ్ ఫాయిసిసుని రాజ్యకాలమందలి (అనుమానితమగు క్రీ. శ. ౫౦) యొక ముద్రయందు ద్విభుజుడగు శివుని మూర్తి కనబడుచున్నది. కాని యాతని తరువాతి రాజుల రాజ్యకాలమందలి ముద్రలపై జతుర్భుజ శివమూర్తి కనబడుచున్నది. కావున క్రీస్తుశక ప్రథమశతాబ్ద శేషభాగమున బ్రసను చతుర్భుజ దేవతామూర్తి ప్రచారమునకు వచ్చినట్లూహింపబడుచున్నది.

చతుర్భుజమూర్తియందు స్వాభావిక హస్తములు రెండిటికి వెనుక నస్వాభావిక హస్తద్వయము నిలుపబడియుండెను. అటు తరువాత క్రమ క్రమముగా హస్త సంఖ్య యధికము గాజొచ్చెను. క్రీస్తుశక షష్ఠశతాబ్దమున బ్రథమాష్ట భుజ దేవమూర్తి వెలసెను. ఎల్లోరా పర్వత గర్భమున (యెనిమిదవ శతాబ్దమున) జెక్కబడిన కైలాస శివమందిరమున ననేక బహుభుజమూర్తులు గలవు. అష్టమ శతాబ్దమున కావలనుండి యెనిమిది చేతుల విష్ణువుని యారుచేతుల త్రివిక్రముని యెనిమిదిచేతుల నరసింహుని సాధారణుడగు నెనిమిది చేతుల శివుని నృత్యకాలమందలి పదునారు చేతుల శివుని పండ్రెండుచేతులు నారు మోములు గల కార్తికేయుని మూర్తులు కనబడుచున్నవి.

మొట్టమొదట వైదిక దేవతాగణమునకు విశేష లక్షణము లేవియు నుండెడివి కావు. ఆకారణముననే యొక్కొక్క దేవతకొక్కొక విశేషవాహనము కల్పింపబడెను. వాహనము మూలముననే యీయది దేవతయని తెలిసికొనబడెను. ఈవిధముననే యింద్రుని వాహనము హస్తి, సూర్యుని కేడు గుఱ్ఱములు, గంగకు మొసలి, యమునకు గూర్మము, ఇట్లె లక్ష్మికి హస్తిద్వయము, సహచరములు. అనంతర యుగమున వేర్వేరు దేవతామూర్తులకు వేర్వేరు విశేషలక్షణము లెప్పుడు కల్పింపబడెనో యప్పుడే వాహనముల వ్యవహారము తక్కువ కాజొచ్చెను. కారణమేమన నప్పుడు వాహనము లేకనే దేవతామూర్తియొక్క స్వరూప నిర్ణయము చేయబడెను. అప్పటి సూర్యమూర్తి యొద్ద గుఱ్ఱములు లేవు. కాని వాని రెండు చేతుల రెండు పద్మములు గలవు. వర్తమాన కాలమున జిత్రకారులు రచించిన లక్ష్మియొక్క చెక్కడములలో గజములు లేవు. కాని యామెకు నాలుగు చేతులు గలవు. మరియు నామె సముద్రమునుండి యుద్భవించినట్లు కనుపడే చెక్కడములును గలవు.

కాని దేవతాదులకు వాహన పరికల్పనము క్రొత్తదికాదు. వేదములందీ సూచనగలదు. ఋగ్వేద దేవతాదుల రథము లశ్వవ్యతిరిక్త భిన్నప్రాణులచే లాగబడెను. ఎట్లన మరుత్తునకు వాహ

నము గృష్ణసారము, పూషణుని వాహనము మేక. కాని యనంతర యుగమందలి దేవతాగణము యొక్క వాహనములు వేదములందలి వాహనముల వలె (సూర్యుని సప్తాశ్వవ్యతీతముగ) నొకటి కాదు. ఇంద్రుని యైరావతము శివుని నంది మొదలగునవి యీ యుగమునందలి కల్పనయే.

దేవతలను గుర్తించుటకు మరియొక సాధనము వారి యాయుధములు. ఎట్లన నింద్రుని వజ్రము, శివుని త్రిశూలము. మొట్ట మొదట యొక యస్త్రము మూలముననే యిది యీ దేవతయని తెలుసుకొన బడెడిది. కాని యనంతర కాలమందలి మూర్తి శిల్పమున దేవతలకు నాలుగాయుధములును, కొన్ని చోట్ల నింక నధికాయుధములను చూడగలము.

ఈ సమస్త ప్రమాణముల మూలమున నీ దిగువ సిద్ధాంత ముపస్థితమయ్యెను.

వైదిక దేవతలకు భిన్నలక్షణము లేవియు లేనందున వారిని గుర్తించుటకే యుపాయమును లేకుండెను. ఆ కారణమునే వాహనములు సృష్టింపబడెను. కాని వాహన వ్యతీతముగా దేవతాగణ మూర్తులను జెక్కవలసిన యావశ్యకత యెప్పుడు గల్గెనో యప్పుడే యాయుధ పరికల్పన మావశ్యకమయ్యెను. కాని స్వాభావిక హస్త ద్వితయము వలన నేవియో భావములు ప్రకటితము లగు చుండుటచే నాయుధ ధారణమునకై మరి రెండు చేతులు కల్పింపబడెను. ఈ పరికల్పనము సంపూర్ణముగ నూతనము గాదు. ఏలన ఋగ్వేదమున రూపకార్థమున నేవియో కొన్ని దేవతలకు బహు ముఖములు, బహు హస్తములు నుల్లేఖింపబడియుండెను. ఎట్లన, అగ్ని త్రిముఖుడు, సప్త భుజుడును. వరుణుడు చతుర్ముఖుడు. విశ్వకర్మ చతుర్భుజుడు. ఈ సిద్ధాంతపోషణమునకై యింకను జెక్క ప్రమాణము లుల్లేఖింపబడియున్నవి. హైందవ శిల్పకళయందంతట ను దేవతాగణము యొక్క స్వాభావికముల గు రెండు చేతులు నేవో భావ ప్రకటనము చేయుట జూచుచున్నాము. మరియు వెనుకటి యస్వాభావిక హస్తములు రెండు నాయుధములను ధరించుచున్నవి. దేవతలతోడ వాహనము లెక్కడనుండెనో యచ్చటి దేవతలకు రెండు చేతులే. ఈ రెండు ప్రమాణములు, పై సిద్ధాంతమును బలపరచుచున్నవి. ఋగ్వేదమునకు దిగువనుండి యుగమునందలి దేవతాగణ మధ్యమున నొక్క బ్రహ్మ మాత్రమె చతుర్ముఖుడు. ఋగ్వేదమున విశ్వకర్మ నాలుగు దిక్కుల తిరిగి చూచెనని వ్రాయబడియున్నది. ఇక ననంతర సాహిత్యమున నాతడు చతుర్ముఖుడనియు, నట్లె బ్రహ్మయు చతుర్ముఖుడనియు గల్పింపబడెను.

క్రమముగా బహు ముఖములు, బహు బాహువులు, దేవతలకు విశేష చిహ్నములుగా నెప్పుడు పరిగణింపబడ జొచ్చెనో యప్పుడే క్రమముగా నప్రధాన దేవతాదుల మోముల యొక్కయు, హస్తముల యొక్కయు, సంఖ్య వృద్ధికాజొచ్చెను. ఈవిధమున శిలా విగ్రహముల నుండిన యిరువది హస్తములు సాహిత్యమున నేబది హస్తములై కన్పడెను. ఇట్లె ముఖ సంఖ్యయు వృద్ధికా నారంభించెను. రావణుని దశముఖములే దాని కుదాహరణము.

గూ. స.

---

# సమాచారము.

సుమారు ౭ సంవత్సరములలో స్వల్పజీత గాండ్రు గాక పెద్ద యుద్యోగస్థులలో సగము మంది బ్రాహ్మణేతరు లుండుటకు వలసిన యేర్పాటులు మైసూరు రాజ్యమున చేయబడుచున్నవి.

ఒక గుజరాతి యిటీవల చనిపోయినప్పుడు తన యాస్తి యంతయు, రు ౨౫౦౦, స్వరాజ్యనిధి కర్పించెను.

బెజవాడ మిషను హైస్కూలును మ్యునిసిపాలిటి వారు తీసికొనిరి.

సంయుక్త పరగణాల కాంగ్రెస్ సంఘమువారు ఇద్దరు స్త్రీలను సభ్యురాండ్రుగా నెన్నుకొనిరి. (౧) శ్రీమతి ఉమా నెహ్రు. (౨) బీగమ్ హసారిట్ మోహీని. వీరును సరోజిని, చాదరాణీల వలె పాటుపడుదురని తలంపబడుచున్నది.

సరళాదేవి చౌదరాణిగారు తన తాత మహర్షి దేవేంద్రనాథ ఠాకూర్ జ్ఞాపకార్థముగ నిచ్చిన నగ తప్ప మిగిలిన రు. ౨౫౦౦ విలువగల నగలన్నియు స్వరాజ్యనిధికి సమర్పించెను.

మఠం బాల సుబ్రహ్మణ్యం గుప్త గారు పాలకొల్లులో నుపన్యసింప నుండ, కృష్ణాజిల్లాలో నెచ్చటను వా రుపన్యసింప గూడదని యుత్తరు వొసంగబడెను. ఆ ప్రాంత వాసులు జిల్లా సరిహద్దుల కావల నఖినేటిపల్లి లంకలో డాక్టరు పి. గురుమూర్తి గారి యాధిపత్యమున ౧౯ వ తేదిన సభ జరపి గుప్త గారి ప్రసంగమును వినిరి.

శ్రేష్ఠమైన రాటములు చేసినవారికి రు ౫౯౪౦ బహుమతి నిచ్చెదనని మహాత్మ గాంధి గారు ప్రకటించిరి. వారి ఆశ్రమమునకు చేరినవాటిలో మూడు బాగున్నవట. వాటిమీద ౧ గంటకు నేరు నూలు వడకవచ్చునట.

కపుర్థాలా సంస్థానాధీశులు లజపతిరాయి గారిని తమ సంస్థానములోనికి రానియ్యలేదు. కాన వారు తిరిగి పోవలసివచ్చెను.

రాజమహేంద్రవర దేశీయ విద్యాలయము గతమాసము ౨౭ వ తేదిన తెరువబడెను.

గౌరు గారి అంతర్జాతీయ వివాహ శాసనమును అంగీకరింపకుండుటకే గాక ముందట్టి చట్టములు రాకుండ జేయుటకును దొరతనమువారిని ప్రార్థించుచు కాశీనగర భారత ధర్మ మహామండలి వారు తీర్మానించిరి.

అసాములో తేయాకు తోటల యధికారుల యొత్తిడి తాళజాలక స్వదేశమునకు తిరిగి వచ్చిన కూలివాండ్రు కులములలో ప్రాయశ్చిత్తములోనైన చేర్చుకొనబడక, పని పాటులు లేక పూర్వముకంటె నధికముగ బాధపడుచున్నారట.

మహాత్మ గాంధి గారును, వారి యనుచరులును బొంబాయి, బొంబాయి పరిసరములందు గతమాసము ౨౧ వ తేదికి ౭౫ లక్షలు తిలక్ స్వరాజ్యనిధికి వసూలు చేసిరి. మిగిలిన ౨౫ లక్షలును ఆ ప్రాంతములందె వసూలు కావచ్చునని తలంపబడుచున్నది.

సత్యమేవజయతే

# ధర్మసాధని

శనివారము, జూలై ౨, ౧౯౨౧.

## సంఘసంస్కరణమునకు నిరోధము

—:o:o:o:—

బరోడా, మైసూరు మున్నగు స్వదేశ సంస్థానములందు పాలకులు పూర్వాచార వాసనల తొలగించుటయె గాక పూర్వాచార పరాయణుల నిరోధము నెదుర్కొనుచు సంఘ సంస్కరణమునకు అనుకూలములగు కొన్ని శాసనములు చేయగలుగుచున్నారు. పూర్వాచారములందెంత పుట్టి పెరిగిన నేమి! విద్యాగంధ మబ్బిన తరువాత, హానికరములగు దురాచారములను సదాచారములని సమర్థించి నిలుప జూచుట స్వార్థపరులగు నే దుష్కింభరులకో తప్ప మిగిలిన వారెవరికి సాధ్యము? జ్ఞాననేత్రము వికసించినచో, అసత్యము విసర్జించుట, సత్యము స్వీకరించుట మానవునకు సహజకృత్యము. స్వదేశ సంస్థానాధిపతులు సంఘపరిస్థితుల నెరిగిన వారగుటచే వీలునుబట్టి యెప్పటికప్పుడు దురాచారముల నిర్మూలించుటకు వలసిన చట్టముల నిర్మింప గలుగుచున్నారు జనులలో సంస్కరణావశ్యకత వ్యాపింప జేయుటకు తామె సంస్కరణ సభలను కూడ నడపుచున్నారు. మైసూరునందు 'సివిక్ సోషల్ కాన్ఫరెన్సు' అను సంస్కరణసభ యొకటిగలదు. దాని పోషణభారము, క్రమపాలనము మైసూరు యువరాజుగారు వహించిరి. తత్సంఘ పక్షమున నిమ్నజాతుల కొరకు ప్రత్యేక పాఠశాలలు, పరపతి సంఘములు స్థాపించుటయు, సాంఘిక పారిశుద్ధ్య విషయముల గూర్చి జనులలో మంచివిజ్ఞానము వ్యాపింప జేయుటయు జరుగుచున్నది. ఈ తీరున స్వదేశ సంస్థానాధిపతులు ~~తమ~~ రాజ్యములందు స్వయముగ సంస్కరణోద్యమమునకు తోడ్పడుచున్నారు. పూర్వాచార పరాయణుల నిరోధము అచ్చట నిలచుట లేదు.

ఆంగ్లపాలనములో నున్న మన దేశప్రాంతములందు సంఘసంస్కరణ సంబంధముగ శాసనము నిర్మింపబడుట మిక్కిలి కష్టసాధ్యముగనున్నది. పూర్వమెప్పుడో, సహగమన నిర్మూలనము, వితంతూద్వాహము, అంతర్జాతీయ వివాహము సందర్భముగ రామమోహనుడు, విద్యాసాగరుడు, కేశవచంద్రుడు విశ్వప్రయత్నములు చేయగా శాసనములు చేయబడినవి. ఆంగ్లేయులు విదేశీయులు. మన మతసాంఘిక విషయములలో జోక్యము కలిగించుకొనరు. కాని పలువురు ఏ సంస్కరణ శాసనమునకు ప్రతికూలముగ నుందురో దానిని చేయుటకు వెరతురు. ఏ మహానీయుడో నిలువబడి యీ శాసనము కావలయునని దృఢముగ పోరు సలిపినప్పుడు అది నిర్మింతురు. కేశవచంద్రుని శాసనము ననుసరించుటకై ఇప్పుడు గౌరుగారు తెచ్చిన వివాహ శాసనమునకు ఇంతకు పూర్వము బాసుగారు తెచ్చిన శాసనమునకు పట్టిన గతియె పట్టవచ్చును. కాశీనగర ధర్మమండలివారు దానికి అడ్డువచ్చిరి. ఇంక నితర మిత ర పూర్వాచార పరాయణులును అడ్డువత్తురు. కాని వారి సంఖ్య అధికముగ నుండుచు ఈవిధమయిన యాటంకము కలుగుచున్నంతవరకు మనకు సంస్కరణ శాసనములు లేకుండుటేనా? ప్రభుత్వము వారు మతసాంఘిక విషయములందు తాటస్థ్యము వహింపవలసినదె. కాని దేశీయులలో కొందరు—స్వల్పసంఖ్యాకులె కావచ్చును—తమ కొరకు కొన్ని సాంఘిక శాసనములు కావలయునని కోరినప్పుడు, వారి కొరకు ఆ శాసనములు చేయుటలో దొరతనము వారి తాటస్థ్య పద్ధతికి ఏమి భంగము కలుగునో మేమూహింప జాలకున్నాము. అనేకులు అసహనముతో తోడి దేశస్థుల సాంఘిక స్వాతంత్ర్యమునకు అడ్డువచ్చుచుండ దొరతనము వారు వారి మాట వినవలసినదేనా? అప్పుడు వారి తాటస్థ్యపద్ధతి నిలచుచున్నదా? స్వల్ప సంఖ్యాకుల యాచారములు మాత్రము మన్నించుట వారి విధి కాదా? దొరతనమువారు తమ తాటస్థ్య పద్ధతినైన క్రమముగ నవర్తింపక పోవుట సంఘ సంస్కరణమునకు మరియొక గొప్ప నిరోధముగా నున్నది.

---

శ్రీ పిఠాపురము రాజు గారి ఆర్ఫనేజిలో వివాహము:–

ఆర్ఫనేజిలో పెరిగిన బాలిక శ్రీమతి శ్యామలాంబకును, టిప్పూరు వాస్తవ్యులు శ్రీయుత జి. నాగయ్య గారికిని గతమాసము ౨౫ వ తేదిన వివాహము జరిగెను. శ్రీ పెద్దాడ రామస్వామి గారు ఎమ్. ఏ. ఆచార్యులుగా నుండిరి. శ్రీ ఆర్. వెంకటరత్నము నాయుడు గారును ప్రార్థన సలిపిరి. ఈశ్వరుడు వధూవరుల నాశీర్వదించును గాక!

---

# మాతృభాష—మతగ్రంథములు.

—:०:०:—

I.

భరతఖండమునందు తిరిగి మహా సంచలనము కలుగుచున్నది. నూతన వికాస చిహ్నములు పొడసూపుచున్నవి. ఇట్టి ప్రబోధము పూర్వ మొకసారి వంగ దేశవిభజన సందర్భమున కలిగియుండెను. దాదాపుగా నాడు అవలంబింపబడిన మార్గములే నేడును జాతీయోద్ధరణమునకై యవలంబింప బడుచున్నవి. జాతీయ విద్య నాటివలెనే నేడును ప్రాముఖ్యమును వహించుచున్నది. ఈవిద్యా విధానమునందు మాతృభాష ప్రధాన స్థానమును ఆక్రమించుకొను చున్నది. అడగద్రొక్కబడిన దేశభాషలు మరల తల లెత్తుచున్నవి. మాతృభాష యిట్టి గౌరవమును బడయుటకు హేతు వేమి? మాతృభాషా మూలమున విద్యా సంపాదనము సులభసాధ్య మగుటయే యిందుకు హేతువు. ఉగ్గుపాలతో మనము నేర్చుకొను భాష మాతృభాష. చిన్నతనము నుండియు నానాదిక్కుల నుండి మన చెవిని బడుచుండు భాష మాతృభాష. మన తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు, ఇరుగుపొరుగువారు, ఎల్లరును ప్రయోగించు భాష మాతృభాష. మన భక్తాగ్రేసరుల మనోహర కీర్తనలచే పావనమైన భాష మాతృభాష. మన కవిచంద్రుల మధుర పద్యావళిచే పవిత్రమైన భాష మాతృభాష. ఇట్టి మాతృభాషా మూలమున గాకున్న అన్యభాషాద్వారమున మనకు జ్ఞానోపార్జనము సుసాధ్యము కానేర్చునా? కాని ఇట్టి మాతృభాషల మట్టువెట్టి ప్రభువులు ఆంగ్లభాషను ముందుకు దెచ్చిరి. మాతృభాషలో పట్టుమని పదిమాటలు చెప్పలేని మహా దుర్దశను తెచ్చిపెట్టిరి. విపత్తును కన్గొని ప్రజలు తల్లిభాషకొరకు పరితపించు చున్నారు. ఆంగ్లభాషా వ్యామోహము నుండి తప్పించుకొనుటకై ప్రయత్నించుచున్నారు.

మాతృభాషా ప్రాశస్త్యమును గూర్చి దేశస్థులెల్లరు తలపోయుచున్న యీ సమయమునందు మన మనస్సు మతజ్ఞానము వైపునకు పోవుచున్నది. సామాన్య భౌతిక జ్ఞాన సంపాదనమునకు మాతృభాష మేటి సాధనమైనచో మతజ్ఞానోపార్జనకు గాకుండునా? కాని మన మతరహస్యము లెందుగలవు? దుర్భేద్యమగు వజ్రపేటికయందు దాగియున్నవి. మన మతగ్రంథములన్నియు గీర్వాణభాషయందు దిమిడియున్నవి. ఈ సంస్కృతభాష తెలిసిన వారెవ్వరు? హిందూ మహాజనుల సంఖ్య యెంత? అందులో సంస్కృతమును అభ్యసించిన వారెందరు? ఆ అభ్యసించిన వారిలోనైన మతగ్రంథముల చదివి అవగాహన చేసికొనగల్గునంతటి పాండిత్య మెంతమందికి గలదు? మాతృభాషయే మూలబడినప్పుడు గీర్వాణభాషను గూర్చి చింతించు వారెవరు? సంస్కృతభాష మృతభాషయే యైనది. గీర్వాణము మృతభాష యైనప్పుడు అందు పొందుపరుపబడిన మహావిషయములెల్ల మృతాక్షరము లగుటలో నాశ్చర్య మేమి? అయితే యిట్టి ఘోరమైన దుస్థితికి కారణభూతులెవ్వరు? పండితులా? సామాన్య ప్రజలా? ఇద్దరును కారణభూతులె. పండితుల పూర్వాచార పరత్వమును సామాన్యజనుల అజ్ఞానమును ప్రస్తుత స్థితికి కారణము.

పండితులు సంస్కృతభాషలో గల వేదాదిమతగ్రంథముల జనుల వాడుక భాషలోనికి మార్చ సమ్మతింపరైరి. జనులును తమ యజ్ఞానముతో సంతుష్టి జెందియూరకుండిరే గాని వేదరహస్యముల తెలిసికొను నాతురతను చూపరైరి. విన్నన్న చెప్పినది వేదమన్నట్లు ఏ బ్రాహ్మణులో చెప్పిన మాటలనే నమ్మి ఆత్మాభివృద్ధికరములగు వేద ధర్మముల గ్రహింప పట్టుదలను కనబరుపరైరి. కాని పర్యవసాన మేమయ్యెను? ద్విజేతరులకు వేదపఠన యోగ్యతయే లేదు. వైశ్యక్షత్రియులలో గూడ శ్రుతులను పఠించువారు లేరనియే నుడువవచ్చును. బ్రాహ్మణులలో నయితము వేదములను పఠింపగలవారు రానురాను తగ్గిపోయిరి. ఒకవేళ పఠింపగల్గినను రోకటి పాటవలె పాడగలవారే గాని తద్భావమును గ్రహించి బోధింపగల్గిన వారు లెక్కకొక్కరైనను గనుపింపరైరి. ఎట్టి దురవస్థ!! ఏగ్రంథము తమకు ఈశ్వరునిచే ప్రసాదింపబడినదని హిందూ మహాజనులచే నమ్మబడుచున్నదో, ఏ గ్రంథము సమస్త జ్ఞానమునకును నిధానమని విశ్వసింపబడుచున్నదో, ఏ గ్రంథము తమ జీవిత సాఫల్య హేతువని తలంపబడుచున్నదో, ఏ గ్రంథము సర్వవిషయములందును అమోఘ ప్రమాణముగా నెంచబడుచున్నదో ఆ వేదగ్రంథము నేడు దాదాపుగా సకల హిందూ ప్రపంచమునకును గగనకుసుమ మయినది.

పా. న.

# మహాత్మ గాంధి.

:౦:౦:

కొందరు క్రైస్తవుల యభిప్రాయములు.

( ) సి. ఎఫ్ ఆండ్రూసుగారు రవీంద్రనాథ టాగూరు గారికి ఇటీవల గాంధిమహాత్ముని గూర్చి యొక పెద్దయుత్తరము వ్రాసిరనియు, అందు ఈక్రింది వాక్యములు గలవనియు ఒక విలేఖరి ఇండిపెండెంటు పత్రికకు వ్రాసెను :

బద్ధవైరము, జాతిద్వేషము, రక్తపాతము, మానవుని సర్వదుష్టవాంఛలు నిర్మూలింపబడి వాని స్థానమున విశ్వజనీనప్రేమ సానుభూతులను గుణరాజములు నెలకొల్పబడునని అందరు కలవరించు సుదినములకు యుద్ధములతో విసుగు జెందియున్న ప్రపంచమును గాంధిమహాత్ముడు, గాంధిమహాత్ముడే, గొంపో గలడని మీరు దృఢముగ నమ్మవలెను. మహాత్మగాంధి ప్రపంచమున ధర్మరాజ్యము స్థాపించుట కుద్భవిల్లిన నూతన 'మసయా' యని చెప్పుటకు నేను సాహసించుచున్నాను.

(౨) కొచ్చిన్ విలేఖరి హిందూ పత్రికకు ఈరీతిన వ్రాయుచున్నారు :

'పామ్ సండే' రోజున సిరియన్ చర్చిలో ధర్మప్రసంగము గావించుచు ఒక బోధకుడు మహాత్మ గాంధియొక్క త్యాగశీలమును విశేషముగ ప్రశంసించి ఆతనిని సెంటు పీటరు, జీసస్ క్రైస్టులతో పోల్చి ఆతని స్వార్థత్యాగము ననుకరింప సభ్యులను హెచ్చరించెను. ప్రసంగము జరగినంతసేపును సభ్యులు మిక్కిలి సావధాన చిత్తులై యుండిరి. 'గుడ్ ఫ్రైడే' సాయంకాలము మార్ థోమా మందిరమున మరియొక యుపన్యాసకుడు తన యుపన్యాసములో గాంధిమహాత్ముడు పుట్టుకవలన గాని జ్ఞానస్నానమువలన గాని క్రైస్తవుడు గాకున్నను, క్రైస్తవులమని చెప్పుకొను వారిలో చాలమంది కంటె శ్రేష్ఠతరుడైన క్రైస్తవుడనియు, ఉత్తమ క్రైస్తవసిద్ధాంతముల ననుసరించి సహాయ నిరాకరణోద్యమము నడపబడుచున్నదని క్రైస్తవబోధకులు జనులకు బోధించుట సమంజసమనియు నుడివెను.


(౩) న్యూయార్కు పట్టణములోని క్రైస్తవసంఘ ముఖ్యాధికారి జె. హోమ్సుగారు ధర్మప్రసంగ మొసంగుచు గాంధి మహాత్ముని గూర్చి యిట్లు చెప్పిరని ఆంధ్రపత్రికలో వ్రాయబడెను :

రోలెండు కేవల మాదర్శములలో మునిగి తేలువాడు. ఆదర్శము లన్నియు కార్యరూపమున పరిణమించునా యని యతడు యోజింపడు. లెనిను కేవలము కార్యపరతంత్రుడు. అతని పరమార్థము లెక్కువ ప్రశంసార్హములు గావు. కావున అన్ని గుణములను కలిగిన వానిని మనము కనుగొనవలసి యున్నది. అతనియందు ఫ్రెంచి దేశస్థుడగు రోలెండున కుండునట్టియు, రుష్యా దేశస్థుడగు లెనినున కుండునట్టియు సుగుణరాశి విరాజిల్లుచుండవలయును. అట్టి మహనీయు డెవరైనను ప్రపంచమునందు నేడున్నాడా?

నిష్కర్షగ నట్టి మహనీయుడు లోకోత్తరపురుషుడు, మానవశ్రేష్ఠుడు, నేడు గలడని నా సంపూర్ణ విశ్వాసము. అతనిని గూర్చి "హిబ్బర్టు పత్రిక" యందు గిల్బర్టు మర్రేగారొక వ్యాసము 1917 లో వ్రాసియుండెను. ఈ వ్యాసమును చదివినప్పుడే, నా కా మహనీయుని గూర్చి ప్రధమ పర్యాయము తెలిసికొనుట కవకాశము గలిగెను. తరువాత కొన్ని మాసములకు ఆమహనీయుని యుపన్యాసములను, వ్యాసములను కొన్నింటిని చదువుట తటస్థించినది. నేనింత దూరము వర్ణించిన దెవరిని గూర్చి యని మీరాశతో నుండుట సహజము. భారత దేశమునందలి బ్రిటిషు పరిపాలనకు ప్రతికూలముగ నుండెడి యుద్యమమునకు నాయకుడును విప్లవకారుడునై యొప్పు మోహనదాసు కరంచందు గాంధిని గూర్చియే నేను పలుకుచుంటిని. అతని దేశీయు లాతనిని "మహాత్ముడని" వ్యవహరించి గౌరవభావమున జూతురు. ... ... ...

ఒక చోటినుండి మరియొక చోటికి వెళ్లునపుడు నలుబది యేబదివేల మందికి తక్కువలేకుండ జనులు గుమిగూడుదురు. అతనిని సందర్శించుటకు ప్రజలువ్విళ్లూరుచుందురు. అతని బాహ్య, అభ్యంతర జీవనము నిష్కళంకముగను, అడంబర రహితముగను, నుండును. ఆతను రాజకీయ ప్రయత్నములందు లెనినువలె కార్యధురంధరుడు. పరమార్థములందు రోలెండువలె నవశోభలతో విలసిల్లువాడు. రోలెండునుగూర్చి యాలోచించునపుడు నాకు టాల్స్టాయియు లెనినుగూర్చి యాలోచించునపుడు నెపోలియనును జ్ఞప్తికి వచ్చుచుందురు. కాని గాంధిని గూర్చి యోజించునపుడు ఏసుక్రీస్తు నామము స్ఫురించును. అతడు తన లక్ష్యము ననుసరించి జీవనము చేయుచుండును. తన మాటప్రకారము నడచుచుండును. బాధలను కష్టముల నెదుర్కొనను. తన దేశసామ్రాజ్య సిద్ధికై అత డెప్పుడో యొక్కపుడు గంభీరముగను కీర్తిప్రదముగను ప్రాణముల విడుచును.

## Wrist Watches.



రిష్టు వాచీ, లేక, చేతికి ధరించు గడియారము. మంచిరకము ,సిలెండరు' వాచీ నిక్కెలు

| | | |
|---|---|---|
| వెండిది 12" సైజు | రు. | 6-8-0 |
| డిటో 10" సైజు చిన్నది | | 9 0-0 |
| రాత్రిలు చీకటిలో కన్పించు „ రేడియమ్" చేతిగడియారము | రు. | 7-8-0 |
| డిటో లీవరు గడియారము 10 కెంపులు గలది | „ | 20-0-0 |
| డిటో 15 కెంపులు కల లీవరు రిష్టు వాచీ | „ | 25-0-0 |

## చలువ జోళ్లు.

——($)——

| | | |
|---|---|---|
| నాలుగు అద్దములు గల మబ్బురంగు జోడు | రు. | 6-8-0 |
| డిటో. రెండవ రకము | „ | 5-0-0 |
| డిటో. క్లోరోఫిల్ అద్దములు | „ | 7-0-0 |
| ప్రిక్కలను „ వల్కనైటు" బిళ్లలును మబ్బురంగు అద్దములును గల „ లారెన్సు & మేయో" కంపెనీ వారి "Amulet" | „ | 7-8-0 |

క్యాటలాగులు పంపబడును.

వలయువారు:—

యం. హెచ్. రావు అండుసన్సు,

కాకినాడ. (అని వ్రాసికోవలెను.)

## కేసరి—పత్రత్రయము.

### లోధ్ర.

గర్భాశయ రోగనివారిణి.

స్త్రీలకు గలుగు బుతుశూల, బహిష్టు కాకుండుట, ఆకాలబహిష్టి, మైల జాస్తిగాను, తక్కువగాను పోవుట, పసుపురోగము, సంతానహీనత, రక్తహీనత, మలబద్ధకము, నూతికావాతము, కీళ్ళనొప్పులు, అరికాళ్ళు, అరచేతులు మంట మొదలగు స్త్రీసుగర్మ వ్యాధులను కుదుర్చును. 24. కు రు. 5. 12 అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు 1-10-0.

### అమృత.

రక్తశుద్ధి ద్రావకము.

ఇది రక్తహీనత, మలబద్ధకము, అజీర్ణము, కీళ్ళనొప్పులు, సోమరితనము, మేహవ్రణములు, సుఖసంకటములు, విస్ఫోటక, కడుపుబ్బు మంట మొదలగు వ్యాధులను నివారించి శరీరమునకు కాంతి సుఖమునకు తేజస్సును యిచ్చును. 24. అవున్సుల రు. 5. 12అవున్సుల బుడ్డి రు 3-0-0. 6 అవున్సుల బుడ్డి రు. 1-10-0.

### అర్క.

సర్వజ్వర నివారిణి.

వాత, పిత్త, కఫ, విషమ, సన్నిపాతకొండ, మన్యసముస్త జ్వరములు జ్వరబిళ్ళ విషపడిశ ములన్నియు సుగ కుదుర్చును. 6 అ. రు 2-8-0; 3 అ రు 1-8-0; 1 అ. 0-8-0.

కేసరికుటీరం, ఆయుర్వేద ఔషధశాల,

ఎగ్మోర్, మదరాసు.

# P. SUBBAROY.

**Ayurvedic Pharmacy,**

*Sri Venkatesa Perumal koil Sannithy,*

TANJORE.

# పి. సుబ్బరాయి.

ఆయుర్వేద ఔషధశాల,

శ్రీవెంకటేశ పెరుమాళ్ళు సన్నిధి, తంజావూరు.

8. కర్ణబిందు:—చెవులలో చీముకారుట, నొప్పి, పోటుపు, చెవులు మూసుకొని గుమ్మనియుండుట, కూతలు, చెవుడు వీటిని గుణపరచును, చెవులు బాగా వినును. సీసా 1 కి వెల అణాలు 8, 1 మొదలు 6 సీసాలవరకు వి. పి. శెలవు అణాలు 8 ప్రత్యేకము.

9. సర్వపాదసంహారి:—నడుము, తొడయొక్క సందులు మొదలగు యే స్థలములలోనైనను మేహపోడ, యెంగిలి చిడుములు, మూగతీట, మూగగజ్జి, శిబ్బి మొదలగు వ్యాధులను బొత్తిగా మాని శీఘ్రముగా గుణపరచును. సీసా 1 కి వెల అణాలు 4. 1 టి మొదలు 12 సీసాలవరకు వి. పి. శెలవు అ. 8 ప్రత్యేకము.

10. విరేచనమునకు మాత్రలు:—కడుపు నొప్పిగాని, వికారముగాని, ఆయాసముగాని లేక సుఖముగా విరోచనమగును. అజీర్ణం, పిత్తప్రపదరోగములు, సకలమైనవాయువులు, మలబద్ధము, అగ్నిమాంద్యము, వాతం, నడుము, చేతులు, కాళ్లు మొదలగు అవయవముల నొప్పులు, సకలమయిన జ్వరములు మొదలయిన వ్యాధులను స్వస్థపరచును, సీసా 1 కి అణాలు 8, 1 టి మొదలు 6 సీసాలవరకు వి. పి. శెలవు అణాలు 8 ప్రత్యేకము.

బొల్లికి మందు.

పైన వ్రాయవలసినది. ఒక వారము వాడిన తప్పక గుణమిచ్చును. మంటయుండదు. మెల్లగా పనిచేయును. అన్ని తత్వములకు సరిపడును. ఒక సీసా ఖరీదు రు 2—0—0. 1 మొదలు 3 సీసాలవరకు వి. పి. ఛార్జి 8 అణాలు అధికము. మావద్ద దొరకు ఆయుర్వేద ఔషధములయొక్క కేటలాగు కోరువారికి ఉచితముగా పంపబడును.

# అమృతాంజనము.

సుందరమైన 1921 ఉపయోగమైన

## క్రొత్తక్యాలండరు

విక్రియమునకు సిద్ధముగనున్నది.

క్యాలండరు వెల 1 కి 0=4=0 వి. పి. ఖర్చులు సహా 0=6=0

వెంటనె వ్రాసుకొనవలయును.

| లామర తైలము | పండ్లపొడి | మోహినీ తైలము |
|---|---|---|
| డబ్బి 1 కి, 0=6=0 | డబ్బి 1 కి, 0=2=0 | సీసా 1 కి, 0=12=0 |

## అమృతాంజనము

అన్ని నొప్పులకు దివ్యామృతము.

దగ్గు, శైత్యము, పడిశము, రొమ్ము పడిశము, తలనొప్పి, వాయువు నొప్పులు, పోట్లు, బెణుకులు, బిళ్లలు, మొదలగు నొప్పులకు దివ్యామృతము.

చక్కని డబ్బితో సహా వెల రు 0-10-0. డజను 1 కి రూ. 6-0-0 పోస్టు ఖర్చులు వేఱు.

## అమృతాంజనము డిపో,

౧౦౯, ఫేరిరోడ్డు, ఫోర్టు, బొంబాయి, ౬, తంబుశెట్టివీధి, మదరాసు.



శ్రీమాన్ వైద్యరత్న పండిత

డి. గోపాలాచార్లుగారు స్థాపించిన

## ఆయుర్వేదాశ్రమము.

41, ఆచారప్పన్ వీధి, జార్జిటవున్, మదరాసు.

ఇందు, మామూలురీతిగా మందులు విక్రయింపబడును.

ప్లేగు, కలరా, ఇన్‌ఫ్లుయెంజా మున్నగు వ్యాధులకును, తదితర వ్యాధులకును మందులు దొరకును.

వ్యాధివివరములను వ్రాసిన, మందులు నిర్ణయించి పంపబడును.

కోరువారికి క్యాటలాగు ఉచితము.

ఎన్. మాధవమీనన్ (ఆయుర్వేదాచార్య)

తంతి విలాసము: 'పండిట్', మదరాసు. } డి. దేశికాచార్యులు, జాయింటు ప్రొప్రయిటర్లు.



## కేనోపనిషత్తు.

——:$:——

ఆంధ్ర పద్యకావ్యము.

శ్రీ ఆదిపూడి సోమనాధరావు కవి విరచితము.

ఈ క్రింది విలాసమునకు రు 0—0—౬ పోస్టు బిళ్లలు పంపిన, పుస్తకము పోస్టుద్వారా పంపబడును.

"ధర్మసాధని కార్యస్థానము."

కాకినాడ.




**Reg. No. M. 1094.**

**The Dharma Sadhani, Cocanada.**

(Printed and Published by K. Hanumanta Rao, at the Dharma Sadhani Press, Cocanada.)


**V. P.** *Rs.* *As.* **To M. R. Ry.**



61 Jayanti Gaganna garu B. A., L. T.,
Head Master, V. H. School,
Rajahmundry.